డా. బీఆర్. అంబేడ్కర్ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ మంగని రాజేంద్ర




భారత రాజ్యాంగం పట్ల నిబద్ధతతో ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పెండేకంటి న్యాయ కళాశాలలో మాట్లాడుతున్న వీఆర్ బద్రీనాథ్ నందుల



ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ రోజు (నవంబర్ 26వ తేదీ)కు గుర్తుగా భారత ప్రభుత్వం 2015వ సంవత్సరం నుంచి రాజ్యాంగ దినోత్సవాన్ని (సంవిధాన్ దివస్‌ను) నిర్వహిస్తోంది. భారతదేశ పౌరులలో రాజ్యాంగ విలువలను పెంపొందించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది.

నాయకులు రాజ్యాంగాన్ని సృష్టించలేరు.. రాజ్యాంగమే నాయకులను తయారు చేస్తుంది.. అందుకే రాజ్యంలో రాజ్యాంగమే గొప్పది.!

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని టీఎస్ జ్యుడిషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మంగని రాజేంద్ర అన్నారు. నేటి పరిస్థితుల్లో మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, హక్కులు, రాజ్యాంగం కల్పించినవేనని ఆయన అన్నారు. మంగళవారం డాక్టర్ డా. బీఆర్. అంబేడ్కర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా డాక్టర్ మంగని రాజేంద్ర మాట్లాడారు. విద్యార్థులు భారత రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు తమ బాధ్యతలను గుర్తెరగాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగంపైనే అన్ని వ్యవస్థలు నడుస్తున్నాయని అన్నారు. పాలన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, బ్యూరోక్రసీ తదితర వ్యవస్థలన్నీ రాజ్యాంగానికి లోబడే పని చేయాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి...

ముషీరాబాద్: భారత రాజ్యాంగడం దేశ ప్రజలందరికి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాన్ని ప్రసాదించిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై డాక్టర్ డా. బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారతదేశ ఖ్యాతిని మన రాజ్యాంగం ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. డాక్టర్ డా. బీఆర్. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ఆరు డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ రావు, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, కె.మాధవ్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్గం అనుసరిస్తే సమాజ పురోగతి..

చిక్కడపల్లి: రాజ్యాంగం సూచించిన మార్గాన్ని అనుసరిస్తే సమాజ పురోగతికి దోహదపడుతుందని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సభ్యుడు వి.ఆర్.బద్రీనాథ్ నందుల అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయ శాస్త్రంలో జరుగుతున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొ. అపర్ణ రాజ్యాంగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆన్‌లైన్ మ్యాగజైన్ రిధాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ విద్యాసంస్థల కోశాధికారి వీఎం పార్థసారథి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయం

చిక్కడపల్లి: భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేడ్కర్ పౌరహక్కులకు కీలకమైన ఆర్టికల్ 32 రాశారని.. సమాన హక్కులు, సమాన అవకాశాలు పొందుపరచిన ఘనత అంబేడ్కర్‌దేనని గాంధీనగర్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ అన్నారు. అరుంధతినగర్ బస్తీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాని మోదీ నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఆర్టికల్ 370 ద్వారా ఒకే దేశం.. ఒకే చట్టం.. ఒకే రాజ్యాంగం అమలైందన్నారు. ఇప్పుడు దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వాటి అనుబంధ సంఘాల నాయకులు ఎం.ఉమేష్, నర్సింహ, సత్యేందర్, నర్సింగరావు, సురేష్, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ డా. బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బర్కత్‌పుర బీజేపీ నగర కార్యాలయంలో

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ రాజ్యాంగాన్ని రచించేందుకు డా. బీఆర్. అంబేడ్కర్ చేసిన కృషి మరవలేనిదని గౌతంరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, శ్యాంసుందర్ గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, రమేష్ యాదవ్, చిట్టి శ్రీధర్, కేశబోయిన శ్రీధర్, శ్యాంరాజ్, సందీప్, అజయ్, సి.వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. దేశ సమగ్రతను కాపాడడంలో వాటి అవశ్యకతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్ మండలి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, మల్కాజిగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగి రమేష్, టీజీటీఏ జనరల్ సెక్రటరీ డా. బ్రిజేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకట ఈశ్వరయ్య, డాక్టర్ లావణ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పద్మజ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అరుంధతినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రభు తదితరులు



భోలక్‌పూర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

అంబర్‌పేట: భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన, గౌరవం ఉండేలా తీర్చిదిద్దుతామని ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు సూచించారు.

స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవంలా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలి



మాట్లాడుతున్న జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్

కాచిగూడ: భారత స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని సౌత్ ఇండియా అడ్వకేట్స్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సౌత్ ఇండియా అడ్వకేట్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జేఏసీ కార్యాలయంలో సుధా నాగేందర్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 75 సంవత్సరాల ప్రజలకు రాజ్యాంగం బలం గురించి తెలియకపోవడం వల్ల ఇబ్బంలు, అవమానాలకు గురయ్యారని అన్నారు. రాజ్యాంగం అములులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా ఇంకా ప్రజలకు సమన్యాయం జరగకపోవడానికి బాధాకరమని అన్నారు. రాజ్యంలో రాజ్యాంగం మాత్రమే గొప్పదని, నాయకులు రాజ్యాంగాన్ని సృష్టించలేరని, రాజ్యాంగం మాత్రమే నాయకులను తయారు చేస్తుందన్నారు. రాజ్యాంగం గొప్పదనం ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్స్ జేఏసీ ప్రతినిధులు సుదర్శన్, గోపాల్‌రాజ్, ఎ.యాదగిరి, శంకరయ్య, నర్సింగ్‌రావు, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 26ను సెలవు దినంగా ప్రకటించాలి



డాక్టర్ డా. బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న జెరూసలెం మత్తయ్య తదితరులు

కవాడిగూడ: రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ పండగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ డా. బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతులను ప్రదర్శించారు. పండగలు, జయంతులు, వర్ధంతులకు సెలవు దినాలుగా ప్రకటించే కేంద్ర ప్రభుత్వం నవంబరు 26ను విస్మరించడం సరికాదన్నారు. క్రైస్తవులకు మత స్వేచ్ఛ హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి దయానంద్, పోకల కిరణ్, పీవీ యోహాన్, ఇజ్రాయల్, పోచయ్య, యేసన్న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆప్ 13వ వ్యవస్థాపక దినోత్సవంతో పాటు 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ హక్కులు.. కాపాడుకోవాల్సిన బాధ్యత అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతలు ప్రతిపాదించిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్యంపై బీజేపీ ప్రత్యక్ష దాడి చేస్తూ.. భారత రాజ్యాంగం పౌరులకు కల్పిస్తున్న న్యాయం, సమానత్వం, హక్కులు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, నేతలు అప్పా, జావిద్ షరీఫ్, రాకేష్‌సింగ్, విజయ్‌కుమార్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సౌకర్యాలు కల్పించాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని హాస్టల్స్, హాస్టల్స్ భోజనాలపై సమగ్ర దర్యాప్తు చేయలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణా, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు మెరుగైన సౌకర్యాలు, వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. హాస్టల్స్‌లో అనేక సమస్యలు తిష్టవేసిన పట్టించుకునే వారే లేరన్నారు.

మైనార్టీ హక్కులపై రౌండ్‌టేబుల్ సమావేశం

రాజ్యాంగం కల్పించిన హక్కులు సామాన్యునికి అందాలి
క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ ప్రెసిడెంట్ పీపీ మెల్కి సేదెక్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్క సామాన్యుడికి అందాలని క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు పీపీ మెల్కి సేదెక్ అన్నారు. మంగళవారం సుందర్యవిజ్ఞానకేంద్రంలో భారత రాజ్యాంగం – క్రైస్తవ ఇతర అల్పా సంఖ్యా వర్గాల హక్కులు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అల్పా సంఖ్యాక వర్గాలు లేదా మైనార్టీలను రెండు రకాలుగా చూస్తుందన్నారు. జాతీయ మైనార్టీ కమిషన్ చట్టం జైనులు, బుద్ధులు, సిక్కులు, క్రైస్తవులు, ముస్లింలను అల్పాసంఖ్యాక వర్గాలుగా గుర్తించిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం గురించి మైనార్టీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టాఫర్ సుధాకర్, కో– ఆర్డినేటర్ ఆల్భట్ ఖురేషీ, దివాకర్ ప్రకాష్, సీహెచ్. లారెన్స్, ఎం. రత్నం, ప్రసాదరావు తదితరులున్నారు.

అభివృద్ధి నమూనా ప్రకృతి విధ్వంసానికే..

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న ప్రొ.గడ్డం లక్ష్మణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి నమూనా ప్రకృతి విధ్వంసానికే అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రకృతి విధ్వంసం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారిందన్నారు. లగచర్లలో గిరిజనులను కొట్టి భూములను లాక్కోవాలని ప్రభుత్వం చూస్తోందని, ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. ప్రజలకు ఇష్టం లేని భూసేకరణ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ అభివృద్ధి నమూనా రాజ్యాంగం, ప్రజలకు వ్యతిరేకం అన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తూ పాలకులు చేస్తున్న ఇలాంటి చర్యలను ఖండించాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని రక్షించేది న్యాయ వ్యవస్థే అయినప్పటికీ ఇది రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. పర్యావరణం ప్రజలు జీవించే హక్కును న్యాయ వ్యవస్థ కాపాడాలన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, హైకోర్టు అడ్వకేట్ వెంకన్న, పీకేఎం నాయకులు జాన్, సీఎంఎస్ నాయకురాలు జ్యోతి, విరసం నేత రాము, డి.సుదర్శన్, డేవిడ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు కడమంచి రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ◆ పార్శిగుట్ట ఫీడర్ పరిధిలోని ప్రేయర్ పవర్‌చర్చి, రాంనగర్, బాప్టిస్ట్ చర్చి, బ్రహ్మంగారి టెంపుల్, గ్రేవియార్డ్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. ◆ 44 నంబర్ స్టాఫ్ ఫీడర్ పరిధిలోని గంగపుత్ర కాలనీ, ఫిష్‌మార్కెట్, ఫ్రెండ్స్‌కాలనీ, రామాలయం, అంజయ్య నాలా తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పేదలకు నిత్యవసరాల పంపిణీ

ముషీరాబాద్: భోలక్‌పూర్‌కు చెందిన ఆపదలో ఉన్న మూడు పేద కుటుంబాలకు బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఏన్ఎం లక్ష్మీబాయి, స్థానికుడు విశాల్ నిత్యవసరాలను అందజేశారు.

ప్రజల జీవనోపాధిని ధ్వంసం చేస్తున్న కేంద్రం



రైతు ధర్నాలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

కవాడిగూడ: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర సంయుక్త కిసాన్‌మోర్చా, జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులు తీవ్ర చలిని సైతం లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో ఢిల్లీని ముట్టడించి కొనసాగిన ఉద్యమంలో 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోతే ప్రధానమంత్రి కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న పంట పెట్టుబడులకు సంబంధించి అదనంగా 50 శాతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో రోజు రోజుకు వ్యవసాయ సాగుభూములు తగ్గుముఖం పడుతుండటం, మరోవైపు రైతుల సంఖ్య తగ్గుతుండగా.. కౌలు రైతుల సంఖ్య పెరుగుతోందని ఈ నేపథ్యంలో వారి రక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్ బాలు, ప్రభాకర్, కిరణ్, కృష్ణారెడ్డి, పాలడుగు భాస్కర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేత గోపాల్‌రావు మృతి



కాచిగూడ: 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేత, నింబోలి అడ్డ మాజీ కార్పొరేటర్ ఎస్. గోపాల్‌రావు (76) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. నింబోలిఅడ్డ కార్పొరేటర్‌గా, కాంగ్రెస్ పార్టీ ఎంసీహెచ్ ఫ్లోర్‌లీడర్‌గా సేవలందించారు. కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి అనుచరుడిగా కొనసాగారు. కాచిగూడ, హరాస్‌పెంట హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడిగా గత 36 సంవత్సరాలుగా సేవలందిస్తూ వచ్చారు. తెలంగాణ అరెకటిక (సూర్యవంశి) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వందలాది స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును పొందారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టి.!

ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహిత



డింపుల్ శర్మ (ఫైల్)

నల్లకుంట: ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టి ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న శ్రీకాంత్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి న్యూ నల్లకుంటలో నివాసముంటున్నారు. ఈనెల 25న దూరపు బంధువు చనిపోగా ఆయన తల్లిదండ్రులు దహన సంస్కారాలకు వెళ్లారు. అలాగే సోదరి విధులకు వెళ్లింది. ఉదయం విధులకు వెళ్లిన శ్రీకాంత్‌శర్మ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి తిరిగి విధులకు వెళ్లిపోయాడు. ఆ సమయంలో భార్య డింపుల్ శర్మ (23) ఇంట్లోనే ఉంది. తిరిగి సాయంత్రం విధులు ముగించుకొని వచ్చి చూడగా ఇంట్లో భార్య కనిపించలేదు. కాగా తాను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టింది. ఆందోళన చెందిన శ్రీకాంత్ స్నేహితులు, బంధువులను విచారించినప్పటికి భార్య ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షన్ పెంచుతామని మోసం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



కవాడిగూడ: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఇతర చేయూత పెన్షన్‌దారులను ఏడాది కాలంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెన్షన్లను పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచకుండా పెన్షన్‌దారులను మోసం చేస్తోందన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016ను రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర్యంగా ఉంచుతూ జీవో నెంబర్ 34ను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల సహకార సంస్థలో ఉద్యోగులకు పెండింగ్ పీఆర్‌సీని ఇవ్వాలని, సంస్థ బలోపేతానికి జీవో నెంబర్ 39ని రద్దుచేసి సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. వికలాంగులకు పంచాయితీరాజ్ నుంచి పార్లమెంటు వరకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. వికలాంగులైన ఉద్యోగస్తులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్ 3శాతం నుంచి 4శాతానికి పెంచి వికలాంగ ఉద్యోగులకు ఇచ్చే స్పెషల్ అలవెన్స్‌ను రూ.3000 నుంచి 6వేలకు పెంచాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న వికలాంగుల మనోవికాస కేంద్రాల సిబ్బందికి హెచ్ఆర్ పాలసీ కల్పించాలన్నారు. చదువుతో సంబంధం లేకుండా వికలాంగులందరికి మోటారు వాహనాలు, బదిరులకు మొబైల్ ఫోన్స్, అంధులకు ల్యాప్‌ట్యాప్, కుష్టువ్యాధిగ్రస్తులకు చెప్పులు, వికలాంగుల సహకార సంస్థ ద్వారా వికలాంగులందరికి స్వయం ఉపాధి కింద రూ.10 లక్షల కింద రుణ సదుపాయం కల్పించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లో డిసెంబర్ 2వ తేదీలోపు పెన్షన్ పెంచాలన్నారు. లేకుంటే డిసెంబర్ 9న ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన సంబురాలను అడుకుంటామని హెచ్చరించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య, జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్. గోపాల్‌రావు, జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, అందె రాంబాబు, పెద్దపల్లి సత్యనారాయణ, మాతంగి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.